


# నల్లని పాలు

## అప్పాజీ

"గోపాలకృష్ణుడు నల్లన.... గోకుల
ములో పాలు తెల్లన"

ఆ పాట వింటున్న గోపాలకృష్ణ ముఖం వెలవెల పోయింది. ఎదురుగా నున్న పాప దుఃఖానికి కారణమవుతుందని లేని చిరునవ్వు తెచ్చుకుంటున్నాడు.

"నాన్నారూ! ఎవరండీ యీ పాట రాశారు? యీ గోకులంలో మీలాంటి తెల్లని కృష్ణభగవానులుంటుండగా నల్లటి కృష్ణుడని రాశారెందుకండీ?"

"నా గురించి కాదమ్మా! కృష్ణ భగవానుని గురించి. మధురా నగరవాసి గోకులంలో గోపకన్యలను ముద్దుమురి పాలలో తేల్చి ముక్తినొసంగిన మహనీయుడు. రాధామనోహరుడు.... ఆనాటి గోకులం.... మాయమర్మ మెరుంగని యాదవులు. గోమాతలిచ్చిన తెల్లని

1982 చక్రపాణి ప్రథమ ఎవార్డు పొందిన కథ

పాలు.... యీనాడు యీ గోకులంలో పాలన్నీ నల్లన.... వంచన.... మోసం .... అందుకే రాణీ నల్లనిపాలు అంటున్నాను."

గోపాలకృష్ణ మాటలు రాణీకి అయోమయంగా వున్నాయి. అతని కండ్ల వెంబడి అశ్రుధారలు. ఎదురుగా కూతురుందన్న సంగతే మరచిపోయాడు.

"అమ్మ దొడ్డమ్మగారింటికి పేరంటానికి వెళ్ళింది. వీధిలో ఉట్ల సంబరం- పైకిపోయి చూడమ్మా!" అని కూతుర్ని పైకి పంపించాడు. మేడమీది చిన్న గదిలో కూర్చున్నాడు. యువకులందరూ తమ కళ్లపై నీళ్లు చల్లుతున్నా లెక్క-పెట్టకుండా మట్టిపిడతల్లోని డబ్బుల్ని చేజిక్కించుకోవాలని విశ్వప్రయత్నం చేస్తూ కొందరు సఫలులౌతున్నారు. చేతికందనివారు వీగిపోతున్నారు.

"నీ పేరున ఏటేటా జరిగే కృష్ణ జయంతి గోపాలకృష్ణా! అందరి బాధ్యతలు కష్టసుఖాలు నీలో ఇముడ్చుకుని నల్లని మూర్తిగా మారిపోయావు కదూ! ఈ గోపాలకృష్ణుడ్ని చూడు! తనలోని పాపాలను ఇతరులకు పంచి తాను స్వచ్ఛంగా తెల్లగా పాలమీగడలా సంఘంలో చలామణి అయిపోతున్నాడు." అంటూ సొమ్మసిల్లిపోయాడు....

ఎండలో ఎండిపోతున్నాడు. వానలో తడిసిపోతున్నాడు. చెప్పులతోపాటు కాళ్లు కూడా అరిగిపోతున్నాయి. నడిచినడిచి కీళ్లనొప్పులు. మొన్నమొన్నటివాళ్లు ఉద్యోగాల్లో చేరిపోగలుగుతున్నారు. కాని గోపాలకృష్ణ బి.కామ్. పాసయి నాలుగేళ్లయినా ఎలాంటి ఉద్యోగానికీ నోచుకోలేకపోతున్నాడు. ఎండలో తిరిగివచ్చినవాడు లోనికి పోయి వెళ్లిన కార్యం సఫలం కాలేదని చెప్పలేక శూన్యంలోకి చూస్తూ నిలబడిపోయాడు.

"పాపమా ముసలమ్మ! రోజూ వచ్చి ఐదారిళ్లలో పాచిపని చేసుకుంటుంది. నడుం వంగినా పొట్టకూటికోసం ఉస్సురుస్సురుమంటూ యాతన. దానికిచ్చిన జీతం పట్టుమని వారంరోజుల బియ్యానికైనా రాదేమో! అయినా ఆ కళ్లలో తృప్తి. అందరూ తన కిస్తున్న అన్నం, కూరపులుసులతో కృతజ్ఞతాపూర్వకమైన వందనం" అనుకుంటూ లోనికి పోయాడు....

పాత్రలోని పదార్థాలను చూస్తూ "శ్రావణ శుక్రవారం. పులగం. పరమాన్నం- పాలకాయలు- సూజీ బూరెలు- అట్లు- వంకాయపచ్చడి. పులిహోర- అన్నీ ఇచ్చారే మామ్మా" అని తులసి నోరూరేలా చెప్పింది.

"రోజూ ఆ యమ్మలిచ్చింది ఇంతో అంతో తింటున్నాం కాదటే! నోరలాగ నీరుకారుస్తున్నావు?"

"ఆ వంకాయ వచ్చిపచ్చడి నాకెంత ఇష్టమనుకున్నావే! అమ్మ బ్రతికున్న రోజుల్లో చేసేది.కరకరలాడే కజ్జికాయలు.

తీయని చంద్రకాంతలు.... అన్నీ అమ్మతోనే పోయాయే."

"బాధపడకే పిచ్చిపిల్లా! నే నున్నంత కాలం నీకేం ఫరవాలేదు. నా నడుమొంగితేనే నీకు బాధలు.... సమాజమోల్ల దయవొల్ల వదికొచ్చినావా! పేసయినావా! ఆ బాబులే సూసుకుంటారు నౌకిరీ."

తులసి మౌనముద్ర కంతు లేదు. "అవును...." అమ్మమ్మ తదనంతరం నా గతి? నన్నాదుకునేవాళ్లు? ధనవంతుల పిల్లలే తప్పటడుగులు వేస్తున్నారు. గోడలమీద చెడురాతలు రాయించుకుంటున్నారు. అనాధగా మిగిలిన ఆడది.... చుక్కానిలేని నావ."

"పోయినమ్మ మనుసులో పడితే మాటామంతీ మానేస్తావు. సెట్టుకీ పుట్టకీ ఎవుడెట్నాడే! మనకీ అంతేనే."

"మనిషి బ్రతుకు చెట్టుపుట్టలోనచే పోలుస్తావు? గోపాలకృష్ణగారు పుస్తకాలిస్తుంటారు. కథలు చదువుతుంటాను. అడుగడుగున మోసాలు. తాను మోసం చేశానని బాధపడడు. విభూది రేఖలతో మోసం. పట్టుపంచతో పరమ పవిత్రునిలా రోజూ దేవాలయ దర్శనం. అదొక రకం మోసం. సాధూలకు అప్పుడప్పుడు భోజనాలు. ఇదీ మోసమే! నాకు తోచింది చెపుతున్నాను. నీతినిజాయితీ మనలాంటి వాళ్లలోనే వుంటుంది. గొప్పవాళ్ల మోసం- దగా- వంచన.... పాపం కాంచనమ్మ- వాళ్ల కేలోటూ లేదు. పిల్ల ముఖమైనా చూసింది కాదు. కాల్చుకు చనిపోయింది. మళ్లీ సర్వలాంఛనాలతో పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్య ఫోటో మాత్రం పెద్దది చేయించి పూలదండ నేస్తారు.... నీ గురించి బాధపడుతున్నాను కాంచనా అని అప్పుడప్పుడు కొంగజపం."

"అబ్బ! నీమాటలచ్చంపంతులమ్మగోరి మాటల్లాగుంటాయే."

తులసి ఆ మాటలకు సిగ్గుపడింది. తన నాజూకు మాటలు మెచ్చుకునే గోపాలకృష్ణ గుర్తుకొచ్చాడు. తనకు పాత పుస్తకాలిస్తూ రెప్పవెయ్యకుండా చూసే సొగసైన చూపులకు తట్టుకోలేని సంఘటనలు కూడ గుర్తుకుతెచ్చుకుని మామ్మ తీసుకువచ్చిన వాటిలో కొన్నింటిని పట్టుకుని ఇంటివెనక గట్టు మీద కూర్చుంది గోపాలకృష్ణను తలంచుకుంటూ....

గోపాలకృష్ణ స్నేహితులందరూ ఒక్కొక్కరూ ఉద్యోగాల్లో చేరిపోతున్నారు. పరీక్షలకు కూర్చుని తట్టుకోగలవారు- ఆర్థికస్తోమత కలవారు- టెక్నికల్ పరీక్షలు పాసైనవారు- ఉద్యోగాలు సంపాదించుకోగలిగారు. బి.కామ్. సాధారణ మార్కులు. ఎందుకూ కొరగాని తన జీవితం గురించి అదేపనిగా ఆలోచిస్తూ మధ్యమధ్య తులసి ముద్దు ముఖాన్ని కండ్లముందు చిత్రించుకుంటున్నాడు.

"చూడు తులసీ! నా కంటూ ఉద్యోగ

ముంటేనా? ఎందరో పిల్లనిస్తామని ముందుకు వచ్చేవారు. ఒకరికన్న మరొకరు కట్నాల రేటు పెంచుకుపోతుంటారు. ఆడపిల్లల్ని కన్న తలితండ్రుల చర్యలన్నీ ఇలానే వుంటాయి. అంతగా అస్థంటూ లేదు. ఉద్యోగం లేదు. అందుకనే మా మామయ్య ఓ కంట కనిపెట్టి చూస్తున్నాడు. ఉద్యోగమన్నది వచ్చేకే తన పిల్లను నా కివ్వాలని. ఉద్యోగం రాదు. రాధ నాది కాలేదు. నా జీవితం సవ్యమార్గంలో సాగాలంటే నీవు నా దానవు కావాలి తులసీ! కులగోత్రాలతో నాకు పనిలేదు. నీ విషయంలో మాత్రం నేను త్యాగం చేయదలచుకున్నాను. ఈ తతంగం ఉద్యోగం కాకముందే జరగాలి. ఉద్యోగమయిందో నా విలువ పెరుగుతుంది. ఇప్పుడు కనుపించని నా వాళ్లందరూ అప్పుడు కనుపిస్తారు. అప్పుడు కుశల ప్రశ్నలు వేస్తారు. అందుకే తులసీ! కులగోత్రాల సంగతి అంతగా పట్టించుకోకూడదు. ఇన్ని సినిమాలు చూస్తున్నామా! కులగోత్రాల ప్రసక్తి రాదు. ఆడామగా అన్యోన్యత కలసి మెలసి సుఖంగా జీవించటం- మధ్యలో కథ పెంచటానికి విలన్! మీ అవ్వ అడ్డు రాదు కదా! నన్ను దూషించి శపించదు కదా! నీ అంగీకారం నీ మనసంత తెల్లగా వున్న ఓ తెల్లకాగితం ముక్క- మీద ముత్యాల్లాంటి అక్షరాలతో నాకు యీనాడే తెలియచేయాలి. అలస్యం చేయకూడదు. నాకు వ్యతిరేకంగా రాయకూడదు. ఎప్పుడూ పాత పుస్తకాలేనా అని మంచి కథల పుస్తకం ఓ నవల యీ జాబుతో నీ కిస్తున్నాను. త్వరగా అతిత్వరగా నాకు తిరుగు జాబు రాయాలి తెలిసిందా? నీ జాబుకోసం వేయి కళ్లతో ఎదురుచూసే తెల్లని గోపాలకృష్ణుడు.

తులసి ఆనందాని కంతు లేదు. "ముందుగా కొత్తపుస్తకం చదవనా? గోపాలకృష్ణ జాబు చదవనా? కళ్లు పెద్దవి చేసి పదేపదే చదివింది. పెద్దింటివాడు తనను కావాలని కోరుతున్నాడు. అవకాశం జారిపోయిందో తన బ్రతుకు? డబ్బుకు ఆశపడే యీ రోజుల్లో, కావాలని కోరి చేసుకుంటానంటున్న గోపాలకృష్ణను తృణీకరిస్తే? ఇలాంటి అవకాశం మళ్లీ వస్తుందా? అట్టమీది బొమ్మను కొంటెగా ప్రశ్నించింది.

"ఏమే తులిసమ్మా? నవ్వుకుంటన్నావు?"

"నవ్వుకుంటే తప్పా?"

"పడిపడి నవ్వుకుంటన్నావు. అందుకనడిగినానే!"

త్వరగా బియ్యంవార్పు తియ్యవే! ఆవకాయ వుందిగా! కలిపి తిందాం"

"పెట్టిందాక తినందానివి ఇయ్యాల తొందర పెట్టేస్తన్నావేమే? రోజూ సల్లారి తేనేగాని తిన్ననేదానివి. ఇయ్యాల ఏడిదేడిది కావాలంటన్నావు!"

"మామ్మా! భోజనంచేసి నీ ప్రక్కను పడుకుని దుప్పటి ముసుగువేసి మా అమ్మలా నిన్ను గట్టిగా కౌగిలించుకుని నా మనసులోని విషయాలను నీకు చెపుతానే మామ్మా!"

అమాయకంగా మనుమరాలి ముఖం చూస్తోంది కుంచమ్మ.....

భోజనం చేశారు. ఒకరిప్రక్క ఒకరు పడుకున్నారు,

"మామ్మా! నే చెప్తానన్న విషయం చెప్పమంటావా? అయితే ఊ కొట్టు. కాదనకు- కాదనకూడదు. గోపాలకృష్ణ గారు.... నన్ను పెళ్లి చేసుకుంటారట! నా ఇష్టం తెలియచెయ్యమన్నారు. కుల గోత్రాలు పట్టింపులేదట! పేద స్థితిలో వున్న నన్ను తప్పక చేసుకుని మన కుటుంబానికి యీ విధంగా సహాయం చేస్తారట!"

"నాకు బయ్యంగుందే తులిసమ్మా! కుర్రోడు సేసుకున్నా పెద్దోళ్లు కత్తి కడ తారే! తర్వాత నీ ఇష్టం"

"అదికాదు మామ్మా! నీవు పోయా వనుకో! నేను ఒంటరిదాన్నయి పోతాను. తప్పుచెయ్యకపోయినా తప్పు చేశానం టారు. అడ్డమైన వాళ్లతో సంబంధా లంట గడతారు. ముందుగానే మేల్కొని గోపాలకృష్ణ చెప్పినట్టు చెయ్యదలచుకు న్నాను మామ్మా!"

దీర్ఘాలోచనలో పడిన కుంచమ్మ గాఢంగా నిద్రపోయింది.

ముసుగునుంచి తప్పుకుని ప్రక్కకు తిరిగిన తులసికి గోపాలకృష్ణ కనుపిస్తు న్నాడు. గోముగా అయనవైపు చూస్తూ చేతిని నిమిరి ముద్దు పెట్టుకుంది.

"నే అంగీకరిస్తున్నాను బాబుగారూ!" అని తృప్తిగా హాయిగా ఆనందం పెన వేసిన నిండుమనసుతో నిద్రపోయింది...

తులసి- గోపాలకృష్ణల వివాహం స్నేహితుల సమక్షంలో రిజిష్ట్రార్ ఆఫీసులో జరిగిపోయింది. తలితండ్రులు విరుచుకుపడ్డారు. బంధువులందరూ ఎంత పనిచేశావురా కులభ్రష్టుడా అని నిందలు వేశారు. అవమానాలతో తల్లడిల్లి పోతోంది తులసి.

"తులసీ! బాధపడి లాభంలేదు. దూషణ, భూషణ, తిరస్కారములు ఆశీస్సులుగా భావించి.... ఆ పాట గుర్తుకు తెచ్చుకో. అలా అయితేనే నాలుగు కాలాలపాటు సుఖంగా బ్రతగ్గలం. అంతా మనసులోనే వుంది. నాకు ఉద్యోగం తప్పక అవుతుంది తులసీ! కులాంతర వివాహాలు చేసుకున్న నాలాంటివారికి ప్రత్యేకంగా ఉద్యోగాలిస్తారు" అని తులసిని బుజ్జగించాడు.

రెండు నెలలు భయంకరమైన బాధలు అనుభవించారు. సోషల్ వెల్ఫేర్ ఆఫీ సరుద్వారా ప్రయత్నించగా గోపాల కృష్ణకు ఉద్యోగమైంది.

"తులసీ! యీ పుణ్యమంతా నీదే! నాకు ఉద్యోగం రావటానికి నీవే కారణం

నా కృతజ్ఞత నీ కెలా తెలియచేసు కోవాలో తెలియటంలేదు."

"చాల పెద్దమాటలు వాడేస్తున్నారు. కృతజ్ఞతన్నారు. అది చాల పెద్దమాట బాబుగారూ!"........

కొద్దిరోజులు గడిచాయి. ఆఫీసునుంచి వస్తున్న గోపాలకృష్ణను మేనమామ పనికట్టుకు కలిశాడు.

"అరే గోపీ! చాల ఘనకార్యం చేశా వురా! ఇందరిని బాధపెట్టి నీవేం సుఖ పడగలవురా?"

"అదికాదు మామయ్యా! ఎంత ప్రయ త్నించినా ఉద్యోగం రావటంలేదు. అసలు రాదు కూడా. వయసు దాటి పోతోంది. ఎందుకూ కొరగాని వాడినై పోతానని కులాంతర వివాహం చేసు కున్నాను. తులసి దయవలన ఉద్యోగం సంపాదించుకున్నాను."

"ఆలోచన మంచిదేరా! ఆచరణలో పెట్టావే.... అదే మంచిదికాదు. సంకర జాతిని సృష్టించి దాంతో సతమతమవటం .... నా నోటితో నేను చెప్పను.అనుభ వించి చూడు."

"వస్తా మామయ్యా!"

"దగ్గరేగా ఇల్లు- కాఫీ పుచ్చుకు వద్దువుగాని రా"

"అ అర్హత పోగొట్టుకున్నాను మామయ్యా!"

"రాధను నీ కివ్వాలని ఉవ్విళ్లూరి పోయాను. దేనికీ అవకాశమివ్వలేదు. మించిపోయింది లేదు. ఉద్యోగమయిం దిగా! ఓ మారు ఆలోచించి చూడు."

"మరోమారు వస్తానింటికి. రాధా కేఫ్‌లో కాఫీ పుచ్చుకుని వెళుదురుగాని రండి." అని ఇద్దరూ కాఫీ త్రాగి ఎవ రింటికి వారు వచ్చారు....

అంతవరకూ అత్తమామలతో నానా మాటలూ పడుతున్న తులసి లేని సంతో షం తెచ్చిపెట్టుకుంది. పరధ్యానంగా వున్న గోపాలకృష్ణను పలుకరించింది.

"అదోలా వున్నారు.... ఆఫీసులో ఏం జరగలేదు కదా?"

"ఏంలేదు తులసీ! పని అలసట"

రోజూ చూస్తున్నాను. నన్ను చేసు కోకముందు కనపరిచిన ప్రేమ రోజూ రాత్రిపూట కాదుకదా పగలుకూడా కను పించటంలేదు."

"అబ్బే! అదేంలేదు. అటు మావయ్య ఇటు అమ్మనాన్నల బెదిరింపులు చీదరిం పులు. తోడబుట్టినవారి కోరచూపులు. నీవీ గదిలోనే వుండు. శరీరంలో జ్వర చిహ్నాలు కనిపిస్తున్నాయి. నేను వరం డాలో పడుకుంటాను. కారణం నీవూహిం చాలి. అనారోగ్యంగా వున్నప్పుడు ఆలు మగలు కాస్తంత దూరంగా వుండాలి. ఆరోగ్య సూత్రాలు పాటించాలి" అని చెక్కిలిపై చిటికవేసి పైకివచ్చాడు....

"గోపీ! పెళ్ళికిముందు ప్రేమన్నావు చదివిన ప్రతి పుస్తకంలోని మాటలు వల్లించావు. తులసి మూలాన కదా నీవు

వుద్యోగం సంపాదించింది. అవసరం తీరిపోయింది. నిరాదరణ. నా అన్నవాళ్లు లేని తులసి మనసు ఆ ఒంటరి గదిలో ఎన్ని చిత్రహింసలకు గురవుతోందో గమనించావా? ఊహించి చూడు నీకే అర్థమౌతుంది."

"ఎందుకోరా! ఆ ప్రేమ వెగటుగా మారిపోయింది. కులం కులమని పెద్దలూ పిల్లలూ అంటున్నారు. ఆలోచనల కంతు లేకపోతోంది. భవిష్యత్తు గాడాంధకారంగా వుంది."

"పిచ్చివాడా! అన్నీ మనసులోనే వున్నాయిరా! అనాధ అని ప్రేమించి పెళ్ళి చేసుకున్నావు. ప్రేమను పెంచుకుంటూ పంచుకుంటూ జీవితం గడపాలి. అదే నీ చెల్లెలి కాపురంలో జరిగితే మీ బావను క్షమించి వూరుకోగలవా? అప్పు డెన్నో హితోక్తులు చెప్తావు. ఆ నీతులే మనకు కూడా వర్తిస్తాయన్న సంగతి మరచిపోకు గోపీ"

కలత నిదుర. కన్ను మూసినా తెర చినాతలితండ్రులుబంధువులు-మామయ్య-రాధ-స్నేహితులు అందరూ కనుపిస్తున్నారు. వాళ్ళందరి నినాదాలమధ్య అంత వరకూ నిండుగా నవ్విన తులసి ఎండిపోయిన తులసిలా కనుపించింది.... తులసికి తొమ్మిది నెలలు నిండాయి. డబ్బు లేనందువలన జనరల్ హాస్పిటల్‌లో వుంచవలసి వచ్చింది. స్నేహితుని భార్య సహాయం కోరాను. మామయ్యగాని రాధగాని తలితండ్రులుగాని ఎవరూ రాలేదు.

"ఇంత నిరాదరణ దేనికి? తలితండ్రులు కసాయివాళ్ళలా ప్రవర్తిస్తున్నారు. ఒకవైపు రాధ గురించి మామయ్య పోరు పడలేకపోతున్నాను...."

"ఏరా గోపీ! ఆడపిల్ల కదూ పుట్టింది. అది పెరిగి పెద్దదైందనుకో! ఎవరొస్తారు చేసుకుంటానని. భ్రష్టుడవంటారు. నీ వెలాగూ పతనమయావు. పెళ్ళీడుకొచ్చిన నీ తోబుట్టువుల పెళ్ళి ఎలా జరుగుతుందేంటి? నీవు దాచినా నేను దాగనివ్వను. క్షణక్షణం నీకూ తులసికీ అడ్డు నిలవటమే నా పని...."

అహోరాత్రులూ అవే ఆలోచనలు. కూతురు పెద్దదైపోతోంది. తోబుట్టువులకు వస్తున్న సంబంధాలు బెడిసికొట్టి వయసు తిరిగిపోయి తలవెంట్రుకలు పండిపోతున్నాయి.

"గోపీ! నీ మూలాన వీళ్ళిద్దరి బ్రతుకులూ ఎలా తారుమారయాయో చూడు. ఉద్యోగం గురించి దానిని లోబరుచుకున్నావు. నీ ఒక్కడి స్వార్థం.... కుటుంబంలో ఎన్నసర్థాలకు దారితీసిందో చూశావా? భూతల నరకం సృష్టించావు. ఎక్కడికయినా పోయి సుఖపడు. నేనూ అమ్మా చచ్చామనుకో! చచ్చేక వెనుక వచ్చి తలకొరివి పెట్టడానికూడా అర్హతలేనివాడవన్న సంగతి మరిచి పోకు".... మనుమరాలు తాతగారూ అని పిలుస్తోంది.

"ఛీ! పాడుపిండం-ఎవడే నీకు తాత! అలా పిలవవద్దన్నానా? ఎదురుగా వుండి మీ పాపిష్టిముఖాలు చూపించక ఏ కొంపకైనా పొండి" అని కసరిపారేశాడు.

అవన్నీ వింటూ చూస్తున్న తులసి మనసు రంపపుకోతకు గురయింది.

"ఈ పెళ్ళికి నే అంగీకరించకపోతే గోపాలకృష్ణ చాలా సుఖపడేవారు. నా మూలాన కదా ఆయనకు తిట్లు."

"ఉద్యోగం గురించి తులసి నెన్నుకున్నాను. దాంపత్య జీవితంలో ఓ ముద్దుల పాప. మంచో చెడో వేరుగా పోవాలి" అని వేరుగా కాపురం పెట్టాడు.

ఉద్యోగం చేస్తున్న కొడుకు విడిపోయాడే అని ఇంటందరూ పోయినవాడి కోసం ఏడ్చినట్టేడ్చారు....

"నా నుంచి మీకు చాలా ఇబ్బందులు. నే నొకటనుకున్నాను. శాశ్వతంగా నేనూ పాపా యీ లోకాన్ని విడిచి పెడితేనో? మీకు పడిన మచ్చ మాసిపోతుంది."

"ఛా! అవేం మాటలు తులసీ? మన సిచ్ఛి పుచ్చుకున్నాం. సాహసించాం. దేశంలో మనలా ఎందరు లేరు? కాలం గడిచేకొద్దీ సమాజంలో మార్పు రాక మానదు. మనుషుల మనసుల్లో కూడా కొస్తంత మార్పు వస్తుంది. పాపకేం ఎదిగేక బంగారంలాంటి సంబంధం" అంటూ తులసి చేతుల్ని పాప బుగ్గల్ని ముద్దాడాడు....

"ఏరా గోపీ! ఇక్కడ చేరావన్న మాట! ఇప్పుడు తెలీదు నీకు, నీ పాప ఎదిగాక చూడు. నీవు పడే ఘోర నరకం ముందుందిరా!...రాధ.... నీకోసంతపించి పోతూ అవివాహితగానే మిగిలిపోయింది. దాని తలరాతకు ఎవరేంచేస్తారు? కట్నం ఇచ్చుకోలేని పరిస్థితుల్లో నీ చేతుల్లో పెట్టాలని మహా ఉబలాటపడ్డాను. సంఘాన్ని సంస్కరించావు. ఆడపిల్లల్ని కన్న తలితండ్రుల దీనాలాపన లిలానే వుంటాయిరా గోపీ."

మామయ్య దీనమైన చూపులకు గోపీ చలించుకుపోయి నిద్రనుంచి లేచి కూర్చున్నాడు. తెల్లవారింది. కాకులు కలకల శబ్దం చేస్తున్నాయి. అమాయకంగా నిద్రపోతున్న తులసిని చూశాడు.

"నీ పేరు తులసే కాని నా త్యాగం నిన్నంటరానిదానిగా మార్చేశాయి. పిల్లలు పుడితే వాళ్ళ భవిష్యత్తు.... మామయ్య అదే పనిగా ఆడిపోస్తున్న దెప్పుడు మాటలు.... జీవితాంతం ఎలా భరించను? అడుసు త్రొక్కి కాలు కడుగవచ్చును. తులసి వున్నంతకాలం నే నడుస్తున్నది అపరిశుభ్రత మీదే! నే చేసింది త్యాగమే కావచ్చును. ఒకరు పదిమంది అశాంతికి కారణం కాకూడదు. ఆ ఒక్కరే పది మంది శాంతికి దూరంగా తప్పుకోవటం లేదా బలికావటం సహజంగా కనుపిస్తోంది." అనుకుంటూ ముఖం కడిగాడు. ఆఫీసు ఫైలు చంకను పెట్టి చిన్న



శబ్దంతో తులసిని లేపి పోతున్నానని చెప్పాడు.

"చూడండి! కాఫీ త్రాగారా? పదిగంటలాఫీసు. ఇప్పుడేనా? నా ఒంట్లో జ్వరంగా వుంది. వారం రోజులనుంచీ మాటామంతీ మానేశారు. మామ్మ దగ్గరకు పోతాను. అక్కడే రెండు రోజులుంటాను." అని కట్టుబట్టలతో బయలుదేరబోయింది.

"తులసీ! గోపాలకృష్ణ వెగటుగా వున్నాడు. తనవారు కాకుల్లా పొడుచుకు తింటున్నారు. నీవు దూరంగా పోతే అదే అదనని జీవితాంతం విడిచిపెడతాడు. అందుకని కదలక మెదలక ఇక్కడే పడుండు. కదిలావో నీ పతనం నీవే కోరి తెచ్చుకుంటున్నావన్నమాట."

"అవును- ఇక్కడే వుంటాను. నా స్థానం నేను నిలదొక్కుకోవాలి. నేనేం

ఆయనను బలవంతం చేయలేదు. త్రోవను పోయే గుదిబండను ఎందుకు కంఠానికి తగిలించుకున్నారు? మూడు రోజుల మోజు తీరగానే బంధువులు మామయ్య తన చెల్లెళ్ల పెళ్లి సంబంధాలంటున్నారు.... దానికి నేను సుత రామూ ఒప్పుకోను" అని అక్కడే తిష్టవేసింది....

"ఏరా కృష్ణా! పెళ్లికిముందు ఎంత తెల్లగా వుండేవాడివిరా! రానురాను మాడి పోతున్నావు. కులగోత్రాల్లేని దానిని చేసుకుని కలుషితమైపోయావు. తలకు నూనె లేదు. దువ్వలేదు. నుదిటినిండా చెమటబిందువులు. కాళ్లీడ్చుకుంటూ సరాసరి ఇక్కడికి వచ్చావేం?"

"మనసు చిత్రవధకు గురవుతోంది మామయ్యా! ఏవేవో పీడకలలు- నా భవిష్యత్తు- అంధకారం- సంఘానికి ఎదురీత- నావల్ల కాదు. ఇప్పటికీ నరకం చాలు. నలుగుర్ని కని మరో నాలుగు అదనపు నరకాల్ని నేను సృష్టించలేను. కొత్తలో నా కెంతో ముద్దుగా కనుపించిన తులసి ఈనాడు నాకెంతో రోతగా కనుపిస్తోంది మామయ్యా."

"ఆ వరండా దాటి లోనికివచ్చావో మీ అత్తయ్య పసుపునీళ్లు శుద్ధికని చల్లుతుంది. అది చేసేవాళ్లకు బాగానే వుంటుంది. ఎదుటివారిని అవమానించామని తమలో తామే సంతోషిస్తారు. కాని అనుభవించేది నీవు.... నీ బాధలు చూడలేకపోతున్నానురా!.... ఆ పెళ్లి ఉద్యోగం అయిన వరకే! దేశంలో లంచం ఎలా ఓ వ్యాపారమై కూర్చుందో ఇదో రకం వ్యాపారంరా! ఆ చరిత్ర నక్కడితో చెరిపేయాలి. కొత్త జీవితానికి అర్రులు చాచాలి. గుమాస్తాగా చేరావు. జీవితాంతం గుమాస్తాగానే వుండిపోవు కదా! రెవెన్యూ ఇన్‌స్పెక్టర్- హెడ్ క్లర్కు.... అలా అలా పైకి.... అలానే జీవితాన్ని మెరుగుపరచుకోవటాని కెన్నో మార్గాలు. తప్పదు గోపీ తప్పదు. మనసు కఠినంగా మారితేనే మరో అడుగు ముందుకు వేయగలవు." అంటూ రాధను పిలిచి బావకు టిఫిన్, కాఫీ తీసుకు రమ్మన్నాడు.

"మీ అమ్మలా మడి తడి అంటూ బావకు దూరంగా వుండి ఆయనను అవమానించకు. వాడికి పిల్లలు లేరు కాబట్టి అంతగా చెడిపోయినవాడికింద జమకట్టకూడదు. ఘోరన్యాయాలు చేసినవారు పరమ కిరాతకులు గర్భగుడిలో సరాసరి పూజార్లకు డబ్బిచ్చి దూరి దేవుడి పాదాల్ని తాకి నాకి యీ దేశ సౌభాగ్యాన్ని మనసారా కోరుకుంటారు. ఉచిత దర్శనంకోసం గంటల తరబడి పైని పడికాపులు కాసే సాదా భక్తులు వీళ్ల కంటికి మూర్ఖుల్లా కనుపిస్తారు...."

బావను ఓరగా చూసింది రాధ.

"నయాపైసకట్నం ఇవ్వనంటున్న మా నాన్న నన్నిలానే ఇంట్లో కూర్చో

బెట్టారు బావా! నీ కోసం తపస్సు చేస్తున్నాను. మధ్యలో తులసివనంలో దూరిపోయావు. నీకు వుండికూడ తపన. నాకు లేని తపన." అంటూ తప్పుకుంది. తలుపు ప్రక్క ఓరగా చూస్తూ నిల్చుంది.

"ఒక్కగా నొక్క కూతురు. రిటైరైతే వచ్చే డబ్బులో సగం నీది. ఫిక్స్‌డ్ డిపోజిట్‌లో వేస్తాను. సరదాగా హోదాగా తిరగటానికి స్కూటర్- ఊడాలో కనీస సౌకర్యాలతో చిన్న ఇల్లు- కొడుకువైనా అల్లుడివైనా నీవే గోపీ! రాధ గురించి కాదు నా బాధ. నీవు సంఘంలో మాటలు పడలేవు. ఎదురుగాలి అందులో యీదురుగాలి వెను తిరగవలసిందే! ఈ మందుపొట్లాలు నీ దగ్గరుంచు- ఇంటికి వెళ్లు- తులసి ఎదురుచూస్తుంటుంది."

బయలుదేరి వచ్చేముందు రాధ చూసిన క్రీగంటి చూపును మనసులో ముద్రించుకున్నాడు.... అంతిమ దశ వరకూ విసుగు బ్రతుకు. తనక్కావ ల్సింది అలాంటి బ్రతుక్కాదు. మిగిలిన రోజులు సుఖసంతోషాల బ్రతుకు.' అనుకుంటూ ఇల్లు చేరుకున్నాడు.

మూలుగుతున్న తులసిని చూశాడు.

"అప్పటినుంచీ ఇప్పటివరకూ ఏ మాటాలేదు బాబూ! ఎవరోచెప్పగావచ్చిన మీ చెల్లెలు చిట్టి మునలమ్మ పలుకరించ టానికివస్తే తూలనాడి తరిమింది."

"మధ్యాహ్నం భోజనం చేశారా?

తులసి మాటలకు గోపీ మౌనంగా దూరంగా నిల్చుని తనవైపు చూస్తున్న చిట్టిని చూశాడు.

"వదినకు కాఫీ కాచి పెట్టు చిట్టీ!"

"ఛీ! వదినట వదిన- నీ మూలాన మాకు రావలసిన పెళ్ళికొడుకులు ఆమడ దూరం నుంచి పారిపోతున్నారు. చెరగని ముద్ర వేశావు. చిన్నా పెద్దా ఒకటే చీదరింపు."

గోపీ కాఫీ పెట్టాడు. తయారైనకాఫీని తులసి చేతికందించాడు. అందించేటప్పుడు చేతులంటుతాయేమో అన్నంత భయపడి పోయాడు.

"జ్వరంతో మూలుగుతున్నానా! నా నుదురు తాకలేదేం?

"కాఫీ త్రాగు."

"కాఫీతోపాటు నే అడిగిందానిక్కూడ సమాధానం కావాలి."

"నా దగ్గర ఏ సమాధానమూ లేదు. ఏదో తప్పుచేసినట్టు చేయబోతున్నట్టు భయపడిపోతున్నాను."

"ఈ జాగ్రత్త ముందే వుంటే ఎంత బాగుందేది."

గోపాలకృష్ణ మౌనం.

"ఈ జాగ్రత ముందుంటే మీకు ఉద్యోగంకాదుగా! అన్నీఅయిపోయాయి- అన్నీ అమరిపోయాయిగా! వడ్డించిన విస్తరి- అనగా మిగిలిన ఎంగిలాకు తొట్టిలో కుక్కలకు పారేస్తారు. అలా అయింది నా కథ."

"కాఫీ తాగు తులసీ!"

"కళ్ళు తిరుగుతున్నాయి. తప్పదు మరి-యీ పరిస్థితులల్లో ఏదైనా తాగుతానండీ! మానవశరీరం- ఆకలికి తట్టుకోలేం కదండీ!" అని గోపాలకృష్ణవైపు జాలిగా చూస్తూ కాఫీ త్రాగింది. గ్లాసు కడిగింది.

"పదివరకూ చదవటం నాదేతప్పండీ! పుస్తకాల్ని అర్థంచేసుకున్నాను. మనుషుల్ని అర్థంచేసుకోలేకపోయాను. మధ్యలోనే చదువుకి స్వస్తిచెప్పి మా మామ్మలా పాచిపనికి పోతే ఎంత బాగుండేది. చింకి చీర పాత జాకెట్‌తో నా స్థానంలో నే నుండవలసింది. ఇలాంటి రంగుల వలలో పడ్డాను."

గోపాలకృష్ణ చికాగ్గా లేచాడు.

"రాత్రికి నేను వస్తేనా?"

"రొట్టె తీసుకు వస్తాను. కాఫీతో తీసుకో. జ్వరం తగ్గుతుంది."

"జ్వరం తగ్గటం కాదు కావలసింది. నా పీడ విరగడైపోవాలి."

"దెప్పుడు మాటలతో అందరూ నన్ను చిత్రవధచేస్తున్నారు-షురో అరగంటలో తిరిగొస్తా- కాసేపైనా మౌనంగా కూర్చో అంటూ గోపాలకృష్ణ విసురుగా పైకి పోయాడు. క్రౌన్ బేకరీవద్ద స్నేహితుల్ని చూశాడు. మనసులోని గాయాన్ని చిందరవందర చేస్తారని పలుకరించకుండానే రొట్టె కొంటున్నాడు.

"హల్లో గోపీ! కులాసానా! పలకరించగానే చిన్న కుర్రాడిలా భయపడుతున్నావేం? మేరీడ్ లైఫ్.... బాగుందా?"

"ఓ! బాగుంది. బ్రహ్మాండంగావుంది," అంటూ కొంచెంసేపు పార్కులో గడిపి ఇంటికి వచ్చాడు-

"జ్వరం- శరీరం కాలిపోతోంది- మీ చేతులతో కాఫీ ఇవ్వండి గోపాలకృష్ణా! మా గోపాలకృష్ణ ఎంతందంగా వుంటాడు! గోపాలకృష్ణుడు తెల్లన- గోకులములో పాలు నల్లన... ఒకప్పుడు చిక్కని పాలకు ప్రసిద్ధి గోకులం. యీనాడు నీళ్ల కలిపిన పాలు.... అంతా వ్యాపారం- పెళ్లి వ్యాపారంగా మారిపోయింది. పిచ్చి తులసి మాటలు పట్టించుకోకుండా కాఫీ ఇవ్వండి."

"మందీ మాత్రలు మింగి కాఫీ తాగు. నయమౌతుంది." కాసేపటిలో తులసి అచేతనంగా చాపమీద నిద్రపోయింది. గోడకు చేరబడి దోషిలా తులసి వైపు చూస్తున్నాడు గోపాలకృష్ణ....

మర్నాడు ఆదివారం. పెల్లుబికిన దుఃఖంతో తులసిని తట్టిలేపాడు. కొయ్యబారిన శరీరం.శాశ్వితంగా నిద్రపోయింది. గోపాలకృష్ణ ఏడుపు కంతులేదు. అందరూ గుమికూడారు.

"పాపం!చలిజ్వరంతో చనిపోయింది" అనోటా అనోటా ప్రాకింది. ముసలమ్మను తోటి ముసలమ్మలు ఓదారుస్తున్నారు. గోపాలకృష్ణ మామయ్య వచ్చి దూరంగా నిల్చున్నాడు.




"మనం మోయం కదా! వాళ్ళ వాళ్ళను పిలిచి డబ్బు ముదుపు పెడితే నానా హంగామా చేస్తారు. భజనలు భజంత్రీలు డప్పులంటారు. సమాజం వాళ్ళను కోరితే తీసుకుపోయే ఏర్పాట్లు చేస్తారు."

"అలాగే మామయ్యా!"-....

ముసలమ్మ ఏడుపు మధ్య, అందరి మౌనం మధ్య తులసిని స్మశానానికి తీసుకుపోయారు....

"క్షణాలమీద అన్నీ జరిగిపోయాయి- అంతే! వాడి తలరాత ఇలా తగలబడా లనుంది. ఇక్కడుంటే అదే జ్ఞాపకం వచ్చి బాధపడటం మనసును ఎన్నెన్నో ఆలోచనలకు గురిచేసుకోవటం జరుగు తుంది. మంచిరోజు చూసి వాడిని నా ఇంటికి తీసుకుపోతాను. రాధను చూశాక పాత విషయాలు మరచిపోతాడు. బావా! తరతరాలు పట్టి పీడిస్తూందనుకున్న శని ఆరునెలల్లోనే విరగడై పోయింది. నీ పిల్లలకు పరవాలేదు. నలుగురిలో తలెత్తుకు తిరగ్గలరు. రాధను మెల్లగా ఊ అన్నాడో మన రెండు కుటుంబాల జాతకం మారిపోతుంది" అంటూ గోపీని బలవంతంగా తన ఇంటికి తీసుకు పోయాడు.

కొరకొర చూస్తున్న భార్యతో "పసుపునీళ్ళ జల్లక్కర్లేదులే! అక్కడే శుద్ధిచేసి తీసుకువచ్చాను," అని చిన్న గదిలో మంచంమీద కూర్చోబెట్టాడు. మంచంమీద పడుకుని ఎవరి ముఖమూ

చూడలేక గోడవైపు తిరిగిపోయాడు. భీతితో కళ్లు మూసుకున్నాడు.

"గోపాలకృష్ణగారూ! నేనండీ తులసిని. మీరు కోరి చేసుకున్న మీ భార్యను .... నేను చనిపోయానా? చంపబడ్డానా? లేక కర్మకాలి ఆయువు తీరి చనిపోయానంటారా? ప్లీజ్! నాకు చెప్పండి. పెళ్లికి ముందు పూపొదరిల్లు. పెళ్లి జరిగింది. ముళ్లపొదరిల్లుగా మారిపోయింది. ఆరు నెలల భీషణ సంగ్రామాన్ని అరడజను చిన్న మాత్రలు శాంతిమండలంగా మార్చగలగాయి కదండీ!.... మానవ జన్మ! అతి ఉత్కృష్టమైన దంటారు. మానవ స్వభావం చూడండి! ఉద్యోగం కోసం నన్నెన్నుకున్నారు. అవసరం తీరింది- ఏవగింపు. మీ కిష్టమైన పాట ఒకసారి పాడమంటారా? గోపాలకృష్ణుడు తెల్లన- గోకులములో పాలు నల్లన."

గభీమని లేచి కూర్చున్నాడు గోపాలకృష్ణ. మంచం కిటువైపు నిల్చున్న రాధను చూశాడు.

"విచారించకు బావా! మరచిపోవటమంత సులువుకాదనుకో! ఒకమారు పెళ్లయినవాడివని ఏ ఒక్కరూ నీకు పిల్లనివ్వరనుకో! ఒంటరి జీవితం గడపలేవు. అందుకే నాన్న నా వివాహం నీతో జరిపిస్తామంటున్నారు. పెళ్లయిందో మళ్లీ నువ్వు సంఘంలో తలెత్తుకు తిరగ్గలవు. నాన్న మాట కాదనలేక మన రెండు కుంటుబాల మంచినీ దృష్టిలో పెట్టుకుని నేనీ తాగ్యం చేస్తున్నాను బావా! నువ్వు నన్ను పెళ్లిచేసుకోవటం కాదు. నేనే నిన్ను పెళ్లిచేసుకుంటాను. తెలిసిందా? ఊ అను బావా!" అని గోపాలకృష్ణతో బలవంతంగా ఊ కొట్టించింది.

"చిన్నచిన్న చికాకులు జగడాలు పొలయలుకలు అలుమగలన్న తర్వాత వస్తుంటాయి. రాక మానవు. తప్పదు కూడ. అలాంటి మాత్రలు నా విషయంలో మాత్రం వాడకు బావా!" అని జీవచ్ఛవంలా చూస్తున్న గోపీని రాధ జడలో కొట్టింది..... తెప్పరిల్లిన గోపాలకృష్ణ అప్పుడే లోనికి అడుగుపెట్టిన కూతురు రాణీ కృష్ణజయంతి సందర్భంగా దొడ్డమ్మగారింటికి పసుపుకుంకుమలు పుచ్చుకోటానికి వెళ్లి వచ్చిన రాధను చూశాడు. మోసగించబడిన తులసి రాధలో కనిపిస్తోందానాడు.

తడబడుతూ గోపాలకృష్ణ "పండుగ బాగా చూశావా రాణీ!" అనడిగాడు.

"చూశాన్నాన్నా! చిన్నపిల్లలునా అంత పిల్లలు కృష్ణవేషం గోపికల వేషంలో ఎంత బాగున్నారనుకున్నారు! ఒక మట్టి పిడతలోని డబ్బులు చెల్లాచెదరైపోయాయి. పాపం నడవలేకపోతున్న కుంచమ్మ డబ్బుల కాశపడి గుంపులోనికిపోయి త్రొక్కిసలాటలో స్పృహతప్పిపోయింది నాన్నా.

రాణీ మాటలకు గోపాలకృష్ణ నిర్జీవంగా చూస్తూ రాధను రాణీని అనుకుని లోనికిపోతూ "గోపాలకృష్ణుడు తెల్లన- గోకులములో పాలు నల్లన" అని మెల్లగా గొణుక్కుంటున్నాడు.